క్లుప్తంగా

అంకాలమ్మకు ప్రత్యేక పూజలు



అంకాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పుట్టా

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో వెలసిన అంకాలమ్మ సన్నిధిలో బుధవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా మండలలోని పల్లవోలు గ్రామంలో టీడీపీ నాయకులు రామాంజనేయులు, మాజీ సర్పంచ్ రామోహన్ ఆధ్వర్యంలో విందు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అంకాలమ్మ తల్లిని దర్శించుకున్న పుట్టా సుధాకర్ యాదవ్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

బి.కోడూరు : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు తెలిపారు. బుధవారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి బర్త్‌ప్లానింగ్ గురించి తెలియజేశారు. హైరిస్క్ ఉన్న గర్భిణులను గుర్తించి హీమోగ్లోబిన్ పెంచుకోవాలని, ప్రభుత్వాసుపత్రిలో కాన్పులు ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలోనే కాన్పులు చేయించుకోవాలన్నారు. 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి రావచ్చని, కాన్పు అనంతరం తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉచిత వాహనం ద్వారా ఇంటికి వెళ్ళవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ



గ్రంథాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కార్యదర్శి అమీరుద్దీన్

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని శాఖా గ్రంథాలయాన్ని బుధవారం ఆ సంస్థ జిల్లా కార్యదర్శి ఎస్.అమిరుద్దీన్ తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని రికార్డులను, రోజువారి దినపత్రికలు, వార, మాస పత్రికలను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. పంచాయతీల నుంచి గ్రంథాలయానికి రావాల్సిన పన్ను, గ్రంథాలయ అభివృద్ధి, పాఠకుల సంఖ్య మెదలైన వాటి మీద దృష్టి సారించాలని ఆదేశించారు. గ్రంథాలయాను ప్రజలు సద్వినియోగం చేసుకోనేలా నిర్వహణ ఉండాలని గ్రంథాయాల అధికారి జే.శివశంకర్ రెడ్డికి సూచించారు.

మైనర్లకు బైక్‌లు ఇవ్వొద్దు



కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ యుగంధర్

ప్రొద్దుటూరు క్రైం : మైనర్లకు బైక్‌లు ఇవ్వడం ప్రమాదకరమని ట్రాఫిక్ సీఐ యుగంధర్ తెలిపారు. పట్టణంలో బుధవారం మైనర్ డ్రైవింగ్‌పై ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్ నడుపుతున్న మైనర్ పిల్లలను ట్రాఫిక్ పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం వారి తల్లిదండ్రులను పిలిపించి సీఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. చిన్న పిల్లలకు బైక్‌లు ఇవ్వరాదని సూచించారు. 18 ఏళ్లు నిండిన తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ పొంది బైక్‌లు నడపాలని చెప్పారు. మైనర్‌లు బైక్ నడుపుతూ ఏదైనా ప్రమాదం జరిగితే తల్లిదండ్రులు నిందితులు అవుతారని హెచ్చరించారు. పట్టుబడిన వారికి మోటార్ వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించారు.

నేడు వేలం పాట

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామంలోని శ్రీచెన్నకేశవ, ఈశ్వర దేవస్థానాలకు సంబంధించిన భూములను గురువారం ఉదయం 11 గంటలకు వేలం పాట వేయనున్నట్లు ఈఓ కె.రామచంద్రాచార్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాట ప్రొద్దుటూరులోని నారాయణ రంగయ్యగారి సత్రంలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొత్తం 21.46 ఎకరాల భూములకు వేలం పాట నిర్వహిస్తున్నామని, హెచ్చు పాటదారుడికి మూడేళ్లు కౌలుకు భూములు ఇవ్వనున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా

పోరుమామిళ్ల (అట్లూరు) : రెండవ సచివాలయ పరిధిలో 104 డాక్టర్, సిబ్బంది లేకుండా కేవలం ఒక్క ఏఎన్ఎం మాత్రమే విధులు నిర్వహించడంపై ప్రజలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేద, బడుగు, బలహీన ప్రజలకు ఆరోగ్య సేవలను అందించాలనే ఉద్దేశ్యంతో 104 సేవలను ఏర్పాటు చేసింది. మండల పరిధిలోని టీకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 104 వాహనం పేరుకే రెండవ సచివాలయం వద్ద ఉంది తప్ప సిబ్బంది మాత్రం లేరని, వైద్యసేవల కోసం వచ్చిన



కదలని 104 వాహనం

రోగులు సిబ్బంది ఎవరూ లేకుండా విలేజ్ హెల్త్ క్లినిక్ తలుపులు మూసి దర్శనమిచ్చాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుని 104 వాహనం ద్వారా వైద్య సేవలు అందించాలని కోరుతున్నారు.



తెరుచుకోని విలేజ్ హెల్త్ క్లినిక్

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

బి.కోడూరు : సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోరుమామిళ్ల మలేరియా సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌ల ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవాల్లో భాగంగా డయేరియా, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ కీటక జనిత వ్యాధులపై వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలకు, గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, దోమలార్వా నియంత్రణ, డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, ఫైలేరియా వంటి జబ్బుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు దోమల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని, దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్ళి దోమ లార్వా పరీక్షలు చేసి



బి.కోడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

లార్వా ఉన్న తొట్లు, స్లాంపులు, ఓవర్‌హెడ్ నీటి ట్యాంకులను శుభ్రం చేసుకుని ఒక గంట తర్వాత నీళ్ళు పట్టుకోవాలని ప్రజలకు చెప్పాలన్నారు. డ్రైనేజీల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమలార్వా నియంత్రణకు అబేట్ ద్రావణం పిచికారి చేయాలని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, జాన్‌విలియం, స్టాఫ్‌నర్సు సునీత, ఫార్మాసిస్టు వెంకటేశ్వర్లు, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రశేఖర్, ఏఎన్ఎంలు, ఎంపీహెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

శాంతికి ప్రతిరూపం బుచ్చనపల్లె

గోపవరం : ఎలాంటి కక్షలు, కార్పణ్యాలకు తావివ్వకుండా శాంతికి ప్రతిరూపంగా బుచ్చనపల్లె గ్రామం నిలిచిందని బద్వేలు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి తెలిపారు. బుధవారం మండలంలోని టీ.సంద్రపల్లె పంచాయతీ బుచ్చనపల్లె గ్రామంలో మండల్ లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి జూనియర్ సివిల్ జడ్జి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు గ్రామానికి సంబంధించి ఒక్క క్రిమినల్ కేసు కూడా నమోదు కాలేదంటే ఇక్కడి ప్రజలు ఎంత ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్నారనేది చెప్పకనే తెలిసిపోతుందన్నారు. ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదుకాని బుచ్చనపల్లె గ్రామాన్ని హైకోర్టు గుర్తించడం జరిగిందని, వారి ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించి గ్రామస్తులను అభినందించడం జరిగిందన్నారు. గ్రామానికి సంబంధించి ఏవైనా సివిల్ కేసులు నమోదై ఉండవచ్చు కాని క్రిమినల్ కేసులు ఒక్కటి కూడా నమోదు కాలేదంటే చాలా సంతోషంగా ఉందన్నారు. ఇంకా ప్రామిసరీ నోట్లకు సంబంధించి ఖచ్చితంగా మూడు నెలల సమయం ఉన్నప్పుడే



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి

కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపారు. న్యాయపరంగా ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఏవైనా సివిల్ కేసులు ఉన్నట్లైతే ఇరువురు లోక్‌అదాలత్‌ను సంప్రదించి రాజీ పడాలన్నారు. ఇందుకోసం పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. ఏది ఏమైనా కక్షలకు తావులేనప్పుడే గ్రామం కూడా అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సమావేశంలో బద్వేలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.బ్రహ్మారెడ్డి, అడ్వకేట్ ఎస్.రమణారెడ్డి, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

పోరుమామిళ్ల (అట్లూరు) : కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసి స్కీంవర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.26 వేలు పెంచాలని సీఐటీయూ ఆలిండియా పిలుపులో భాగంగా బుధవారం తహసీల్దారు కార్యాలయం, సీడీపీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.భైరవప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్‌లుగా తీసుకురావడం దుర్మార్గమని తెలిపారు. విభజన చట్టంలో కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఉన్నదని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు విజయమ్మ, అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు మేరీ, దస్తగిరమ్మ పాల్గొన్నారు.

బిల్లులను వెంటనే విడుదల చేయాలి

రాజుపాళెం : జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీ హాస్టల్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రొద్దుటూరు నియోజకర్గ వేదిక కన్వీనర్ నాగరాజు తెలిపారు. రాజుపాళెంలోని ఎస్సీ హాస్టల్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలంటే చదువుకున్న ప్రతి విద్యార్థికి అర్హతను బట్టి హాస్టల్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మహేంద్ర, శివ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని బుధవారం ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ అరుణకుమారికి సీఐటీయూ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.సుబ్బలక్ష్మి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడో సారి అధికారం చేపట్టి కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, సీఐటీయూ



వినతి పత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

పట్టణ కార్యదర్శి విజయకుమార్, రాఘవ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు గీత, నాగవేణి, సువార్తమ్మ, అంజనమ్మ, రామసుబ్బమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పశుగ్రాసాన్ని ఎంచుకోవాలి

రాజుపాళెం : పాడి రైతులంతా మంచి రకం కలిగిన పశుగ్రాసాన్ని ఎంచుకోవాలని పెద్దముడియం, రాజుపాళెం మండలాల పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ ఈ.వెంకటేశ్వర్లు తెలిపారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా రాజుపాళెం గ్రామంలో బుధవారం పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహువార్షిక పశుగ్రాసాలైన ఏపీ బీఎం, కోవర్‌కోట్, పారా గడ్డి జాతి పశుగ్రాసాల గురించి వివరించారు. ఏక వార్షిక పశుగ్రాసాలైన పీసీ 23, ఎస్‌హెచ్‌జీ గడ్డి రకాల గురించి తెలిపారు. ఈ



రైతులతో మాట్లాడుతున్న ఏడీ డాక్టర్ వెంకటేశ్వర్లు

పశుగ్రాసాల వలన పాడి రైతులకు పాల ఉత్పత్తి పెంపుదలతోపాటు వెన్న శాతం పెరుగుదలకు తోడ్పడుతుందని చెప్పారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

ప్రొద్దుటూరు క్రైం : గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని స్త్రీల వ్యాధి నిపుణురాలు డాక్టర్ జ్యోతి తెలిపారు. ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు.

డాక్టర్ జ్యోతి స్కానింగ్ చేయడంతో పాటు, కొత్తగా వచ్చిన స్కానింగ్ మిషన్ ద్వారా గర్భిణుల్లో గుండె చప్పుడు, బిడ్డ ఎదుగుదల, బిడ్డ పొజిషన్ గురించి తెలుసుకున్నారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ గర్భిణులు సంపూర్ణ పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు సురక్షితమని తెలిపారు. వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి వెళ్లేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్లు చంద్రకళ, బీపీ వరప్రసాద్, సీహెచ్‌ఓలు అంజలి, సంధ్య, ఫార్మసీ ఆఫీసర్ శ్రీధర్, లక్ష్మణ్‌స్వామి, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రొద్దుటూరు : స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కార్మికులంతా కనీస వేతనాల కోసం, ఉద్యోగ భద్రత కోసం రోడ్లు ఎక్కాల్సిన దుస్థితిని బీజేపీ ప్రభుత్వం కల్పించిందని విమర్శించారు. సుప్రీం కోర్టు ఆర్డర్ అనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇస్తే కానీ కుటుంబాలు బతకలేవని పేర్కొన్నారు. కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం హరిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నిలువరించాల్సిన అవసరం ఉందన్నారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

విజయకుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చంటి, సాల్మోన్, నాయకులు రాఘవ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్

ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నట్లు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. బుధవారం మైదుకూరు మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా సర్వతోముఖాభివృద్ధి కోసం ఒక మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనందున కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తెచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. సమావేశాల్లో, అభివృద్ధి విషయంలో పార్టీల గురించి ప్రస్తావించవద్దని సూచించారు. వార్డుల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి అన్ని వార్డుల అభివృద్ధి కోసం పాటుపడాలని అన్నారు. నిధుల సమీకరణపై చర్చించి ప్రతి ఒక్కరూ మున్సిపాలిటీ అభివృద్ధికి కలిసి రావాలని కోరారు. పనుల్లో నాణ్యత లేకపోతే ఒప్పుకునే ప్రసక్తే లేదని అన్నారు. మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

పుట్టా సుధాకర్ యాదవ్ కృషి చేయాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని పశువుల సంత స్థలం అన్యాక్రాంతం కాకుండా అక్కడ రైతులకు ఉపయోగపడే విధంగా గోదాములను నిర్మించేందుకు కృషి చేయాలని విన్నవించారు. కాగా సమావేశంలోని అజెండాలో పొందుపరిచిన 22, 23 అంశాల్లో ఉన్న పశువుల సంత గురించి ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ పశువుల సంత క్రయవిక్రయాలకు దూరంగా ఉన్నందున స్థానిక నంద్యాల రోడ్డులోని పాత పశువుల సంత స్థానంలోనే నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్ మాట్లాడుతూ గగ్గితిప్ప వద్ద ఉన్న సంతలో ఇప్పటికే రూ.2కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేసినందున, సంతను అక్కడే కొనసాగించాలని కోరారు. పాత పశువుల సంత స్థలంలో రైతు బజార్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై ప్రజల అభిప్రాయం తీసుకుంటామని ఎమ్మెల్యే బదిలిచ్చారు. సమావేశంలో కమిషనర్ జబ్బార్ మియా, ఏఈ విశ్వ, మేనేజర్ పరమేశ్వర్ రెడ్డి, ఎంఈఓ పద్మలత, ట్రాన్స్‌కో ఏఈ రామభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశంలో..

మైదుకూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పుట్టా సుధాకర్ యాదవ్ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సహకరించాలని కోరారు. గెలిపించిన ప్రజలకు సేవ చేసేందుకు పార్టీలకతీతంగా కలిసి రావాలని తెలిపారు. అవినీతికి పాల్పడితే సహించేది లేదన్నారు. సమావేశంలో ఎంపీపీ థామస్, వైస్ ఎంపీపీ చిన్న కొండమ్మ, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, జెడ్పీటీసీ ప్రసన్నలక్ష్మి, మండల కోఆప్షన్ సభ్యుడు ఇంతియాజ్ ఖాన్, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

బద్వేలు అర్బన్ : కార్మిక వ్యతిరేక నాలుగు నల్లచట్టాలను రద్దు చేసి స్కీంవర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ పట్టణ నాయకులు కె.శివకుమార్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్నిలు తెలిపారు. కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్‌లుగా తీసుకురావడం దుర్మార్గమైన చర్య అన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కోరారు. అలాగే నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. అనంతరం ఆర్డీఓ చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు, డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

బ్రహ్మంగారిమఠం : మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివ మల్లేశప్ప ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షుడు సి.వీరనారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ హాజరు అవుతునట్లు తెలిపారు. ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు తప్పకుండా పాల్గొనాలని కోరారు.

ప్లే గ్రౌండ్ లేని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లకు సంబంధించి ప్లే గ్రౌండ్ లేని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం డీఈఓ మర్రెడ్డి అనురాధను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చాలా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలకు వ్యతిరేకంగా అపార్టుమెంట్, షాపింగ్ కాంప్లెక్స్‌లు, రేకుల షెడ్లలో తరగతులను నిర్వహిస్తున్నాయన్నారు. అధికారులు సంబంధిత పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తల్లికి వందనం ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింపజేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో విద్యార్థుల తల్లులకు ఇచ్చే రూ.15వేలు ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింపజేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో బుధవారం ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే తల్లికి వందనం పథకం అమలు చేయడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయన్నారు. ప్రభుత్వ విద్యారంగానికి నష్టం కలిగించిన జీఓ నంబర్ 117ను రద్దు చేయాలన్నారు. ఉన్నత పాఠశాలలలో ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాలన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుడి పోస్టులను మంజూరు చేయాలన్నారు. అన్ని రకాల పదోన్నతులను వెంటనే చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ప్రొద్దుటూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బయ్య, సయ్యద్ బాషా, జిల్లా కౌన్సిలర్లు దస్తగిరి, ఈశ్వర్‌రెడ్డి, జహంగీర్, అబ్దుల్ ఖాదర్, సుధాకర్ పాల్గొన్నారు.

'సీమ' ప్రజల జీవితానికి చిత్రిక పట్టిన రచయిత 'కేతు'

కడప కల్చరల్ : రాయలసీమ ప్రజల జీవితానికి చిత్రిక పట్టిన రచయిత ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి అని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి తెలిపారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బుధవారం ప్రసిద్ధ కథారచయిత ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి 86వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేతు కడపజిల్లా గ్రామ నామాలపైన లోతైన పరిశోధన చేసి విశిష్టమైన పంథాలో గ్రామ నామాలను, ఆ గ్రామాల జీవన విధానాన్ని, ఆచార వ్యవహారాలను, ఆర్థిక అసమానతలను పరిశీలించి వెలువరించిన అధ్యయన ఫలితాలు ప్రశంసనీయమన్నారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులుగా బ్రౌన్ గ్రంథాలయానికి ఆయన అందించిన సేవలు మరువరానివన్నారు. మరో సహాయ పరిశోధకులు చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ విశ్వనాథరెడ్డి తాను పుట్టిన నేల, పెరిగిన సమాజం ఈ రెండింటిని ప్రధాన వస్తువుగా చేసుకొని అద్భుత కథలను రాశారని కొనియాడారు. గ్రంథాలయ సహాయకులు రమేశ్‌రావు, జి.హరిభూషణరావు మాట్లాడారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూని యర్ అసిస్టెంట్లు వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది పి.అరుణ కుమారి, పి.సుమతి పాల్గొన్నారు.

జాబ్ మేళాలు నిరుద్యోగులకు వరం లాంటివి

జమ్మలమడుగు : నిరుద్యోగులకు జాబ్ మేళాలు వరం లాంటివని వాటిని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నతస్థాయిలోకి రావాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ నవరూప్‌కుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అందరికి ప్రభుత్వ ఉద్యోగాలు రావడం కష్టతరమైన సమయంలో ప్రైవేట్ సంస్థలు నిర్వహించే జాబ్ మేళాలు నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయన్నారు. ఈజాబ్ మేళాలో 300 మంది హాజరు కాగా 240 మందికి ఉద్యోగవకావాలు వచ్చాయి. అమ



జాబ్ మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

ర్‌రాజా కంపెనీలో 111 మందికి, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్‌లో 50 మందికి, డిక్సన్ టెక్నాలజి కొప్పర్తి కంపెనీ 60, న్యూహాలండ్ ట్రాక్టర్స్ కంపెనీలో 19 మందికి ఉద్యోగావకాశాలు వచ్చాయని తెలిపారు.

జీవ భౌతిక విభాగాల్లో పరిశోధనకు అవకాశాలు

వైవీయూ: జీవ భౌతిక విభాగాల్లో పరిశోధనకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగ ప్రొఫెసర్ వి. రాజగోపాల్ రెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఫిజికల్ సొసైటీ ఆధ్వర్యంలో «బయోఫిజికల్ సైన్సెస్ రీసెర్చ్‌లో అవగాహన్నపై ఒక్కరోజు విద్యావిషయక సంభాషణ (కొలోక్వియం) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫిజికల్ సొసైటీ అధ్యక్షుడు, ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొ.కె. కృష్ణారెడ్డి నేతృత్వం వహించారు. ఫిజిక్స్ ప్రతినిధుల బృందంలో సభ్యులైన తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి విద్యాలయం భౌతికశాస్త్ర విభాగ ప్రొఫెసర్ వి. రాజగోపాల్ రెడ్డి 'సెమీకండక్టర్ పరికరాలు వాటి అప్లికేషన్లు' అన్న అంశంపై విశ్లేషించారు. వివిధ రంగాలలో సెమీకండక్టర్ టెక్నాలజీ పురోగతి ఆచరణాత్మక ఉపయోగాలను వివరించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథ రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై మాట్లాడుతూ ఇంటర్ డిసిప్లినరీ పరిశోధన విధానాల ప్రాముఖ్యతను గురించి వివరించారు. తిరుపతి శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాల విశ్రాంత సహ ఆచార్యులు డాక్టర్ ఎన్. నాగరాజు 'పర్యావరణ అవగాహన' అనే అంశంపై ప్రసంగించారు. పర్యావరణ శాస్త్రీయ పరిశోధన, రోజువారీ అభ్యాసాలలో ఏకీకృతం చేయవలసిన అవసరాన్ని గుర్తు చేశారు. శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాల ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ కే. రవీంద్రనాథ్ రెడ్డి , ఫిజిక్స్ సహ ఆచార్యులు డా. వి.వెంకటరాముడు, డా. రాఘవేందర్, ఫిజికల్ సొసైటీ అధ్యక్షుడు, ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొ.కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ కొలోక్వియం అర్థవంతంగా సాగిందని, బయోఫిజికల్ సైన్సెస్ పరిశోధన, దాని అనువర్తనాలపై లోతైన అవగాహనను అందించిందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఇది జ్ఞాన మార్పిడికి వేదికగా పనిచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పరిశోధకులు, అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు చదువుతోపాటు ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థి దశ నుంచే నేర్చుకోవాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు పిలుపునిచ్చారు. బుధవారం కడప ఐటీఐ కళాశాలలో నగర ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో విద్యారంగంలో అనేక మార్పు లు చోటు చేసుకుంటున్నాయన్నారు. మార్పులకు అనుగుణంగా పిల్లలు సిద్ధం కావాలన్నారు. టీడీపీ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలన్నారు. అలాగే డిగ్రీ ప్రవేశాలను ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి ఆఫ్‌లైన్ విధానంలో అమలు చేయాలన్నారు.

నూతన నగర కమిటీ ఎన్నిక...

గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో నగర అధ్యక్షులు నవీన్, నగర కార్యదర్శి శెట్టిపల్లి రెడ్డిసాయి, ఉపాధ్యక్షులు ఇర్ఫాన్, పవన్, సురేష్, సహాయ కార్యదర్శిగా నాగమునయ్య, భరత్, కమిటీ సభ్యులు వెంకటేష్, లోకేష్, ప్రసాద్‌లతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.